# తార

"అమ్మా ! నిజం చెప్పమ్మా. నువ్వింత ఘోరం చేశావంటే అసలు చేయగలిగావంటే నమ్మలేకుండా ఉన్నాను."

నేను చేశాను ఆ ఘోరం. నిజంగా నేనే చేశాను ఈ చేతులతో. నన్ను నమ్మ."

"నవ మాసాలు నన్ను మోసి, కని, పెంచి, పెద్దచేసిన నీ అమృత హృదయంలో ద్వేషానికి స్థానం లేదు. నువ్వు అబద్ధం ఆడుతున్నావు. నాకు తెలుసు. నువ్వు ఏదో దాస్తున్నావు."

"నిజం తల్లీ, నేనే ఆ హత్య చేశాను."

"ఎందుకమ్మా నన్ను చిత్రవధ చేస్తావు శూలాలలాంటి అబద్ధాలతో. నువ్వు హత్య చేయలేదు. నాకు తెలుసు."

"........................."

"సరే. నువ్వు చెప్పకపోయినా నేను అసలు రహస్యం కనుక్కొని తీరుతాను. నీకు న్యాయం చేకూరేలా చేస్తాను. ఎందుకు, ఎవరికి భయపడి నువ్వు ఈ అబద్ధం ఆడుతున్నావో కనుక్కుంటాను. నువ్వు నిశ్చింతగా ఉండమ్మా."

"తల్లీ! అలాంటి పనిమాత్రం చెయ్యకు. నా మాటలు విశ్వసించు. నేను చేస్తున్నది సరయినదే."

"నువ్వు నిజం చెప్పమ్మా మరి."

"ఎలా చెప్పను. తల్లీ ?"

"అయితే, రేపీపాటికీ ఆ నిజమయిన హంతకుడు ఇక్కడ ఉంటాడు. నీకు స్వేచ్ఛ లభిస్తుంది."

"అయ్యో, తల్లీ! ఏ స్త్రీ అయినా అయిదోతనం కోరుకుంటుంది."

"అంటే?"

"అవును. తల్లీ, మీ నాన్నగారే ఈ ఘోరం చేశారు. ఆయనని ఉరి తీస్తే నేను బ్రతకగలనా? ఎంత నీచుడయినా, భర్త దైవంతో సమానం భారత స్త్రీకి."

"నాన్నా! ఎంత పాపానికి ఒడిగట్టావు నిన్ను దేముడు కూడా క్షమించడు. ఎంత శ్లాఘనీయమయిన త్యాగం చేస్తున్నావమ్మా"

"తల్లీ! నాకు మాటివ్వు. మీ నాన్నని ఇందులోకి లాగనని మాటివ్వు."

"కట్."

అంతవరకూ కొంచెం క్యూరియస్‌గా చూస్తున్నాను. బరువయిన ఆ సన్నివేశ చిత్రీకరణని, సినిమా స్టూడియోలో. ఆశ్చర్యపోయాను. అంతవరకూ ఎంతో విషాదంగా, బరువుగా నటించిన సునంద చిరునవ్వుతో చేతి రుమాలుతో ముఖం అద్దుకుంటూ ఏదో మాట్లాడుతూంది కెమెరా మాన్‌తో. బట్టలు విడిచి, కొత్తవి తొడుక్కున్నట్లుగా ఎంత తేలికగా భావాలను మార్చి, మారిపోగలరు ఈ నటులు! నాలాంటివాడయితే తేరుకోవడానికి చాలా సేపవుతుంది మరి.

సహాయ దర్శకుడు సునందతో ఏదో చెప్పాడు, నా వంక చూస్తూ. సునంద నావైపు చూసి, చెయ్యి ఊపి నవ్వుతూ నడిచి వచ్చింది.

సునంద నడకలో హొయలున్నాయనుకున్నాను మనస్సులోనే.

"నమస్తే" అన్నది సునంద చిరునవ్వుతో.

"నమస్తే. మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడుగుదామని వచ్చాను. మీ

కభ్యంతరం లేకపోతే ఇప్పుడు ఇంటర్వ్యూ ఇవ్వగలరా? మా పాఠకులు చాలామంది మీ పరిచయం కోసం ఎదురుచూస్తున్నారు."

"అలాగే కూర్చోండి."

ఇద్దరం సెట్ బయట వేసి ఉన్న పేము కుర్చీల్లో కూర్చున్నాం. ఓసారి రిస్ట్‌వాచీ వంక చూసుకుని అన్నది సునంద: పది నిముషాల్లో మరో షాట్ రెడీ అవుతుం దనుకుంటాను చిత్రీకరణకి."

"పది నిముషాలు ఎక్కువే నాకు." నవ్వుతూ షార్ట్‌హాండ్ పుస్తకం తీసి సిద్ధంగా పట్టుకొన్నాను.

"తెలుగు షార్ట్‌హాండ్ వచ్చా మీకు?"

"రాదు. మీ సమాధానం ఇంగ్లీష్‌లో రాసుకుని, మళ్ళీ మా ఆఫీస్‌లో తర్జుమా చేసుకుంటాను.

"ఇంగ్లీష్‌లో అడుగుతారా?"

"తెలుగులోనే. మొదటి ప్రశ్న - అబద్ధం చెప్పకూడదు. మీ వయస్సు?"

"ఎలా ఉంది ఇప్పుడు మీరు చూసిన షాట్?" అడిగింది సునంద.

"బాగుంది. కాని, తలా తోకా తెలియలేదు. సినిమాటిక్‌గా ఉంది.

"అంటే?"

"సాధారణంగా కథల్లో అంత బరువయిన సంభాషణలు సాగవు. 'శ్లాఘనీయం' లాంటి క్లిష్టమయిన పదాలతో.

"అడగండి" అన్నది సునంద నవ్వి.

"నా ప్రశ్న మొదటిదే స్కిప్ చేస్తున్నారు మీరు."

చిన్నగా నవ్వి చేతి గోళ్ళకున్న రంగువంక చూసుకోసాగింది.

"మీరు సినీరంగంలో ఓ తారగా మూడు సంవత్సరాల నుంచి నిలబడడానికి కారణం అదృష్టమా, కృషా?"

"రెంటి కలయిక."

"ఎలాంటి పాత్రలంటే మీకు ఇష్టం ?"

"బరువయిన పాత్రలు. న టిం చ డా ని కి ఎక్కువ అవకాశం ఉంటుంది. చలాకీ పాత్రల కన్నా."

"రాజకీయాల్లో ఆసక్తి లేదా మీకు?"

"టైమ్ దేనికీ చాలడం లేదు."

"టైమ్ చాలకపోవడానికి కారణం ఒకేసారి ఎక్కువ చిత్రాల్లో నటించడం అయి ఉండవచ్చుగా. హాలీవుడ్‌లో బాగా తక్కువ చిత్రాల్లో నటిస్తే ఎలా ఉంటుంది ?"

"మీ ప్రశ్నలోనే కొంతదాకా సమాధానం ఉంది. ఇది హాలీవుడ్ కాదు. సంవత్సరం చివర ఎన్ని చిత్రాల్లో నటించారని లెక్క చూసి మార్కులు వేసే భారతదేశం."

"ఎక్కువ చిత్రాల్లో నటిస్తే పాపులారిటీ ఎక్కువ లభిస్తుందని మీ ఉద్దేశమా ?"

అవును. అఫ్‌కోర్స్. 'స్టార్ ఇమేజ్' కోసం ఇంకా కొన్ని ఇతర మార్గాలున్నాయి. ఈ వృత్తిలోని వాళ్ళ స్వంత జీవితం మీద ప్రజలకి ఆసక్తి ఎక్కువగా ఉంటుంది ఎక్కడయినా. ఆ స్వంత జీవితాన్ని అందముగా చూపించి పాపులర్ అనడం ఓ పద్ధతి.

"ఎలా? వివరంగా చెప్పగలరా ?"

ఉదాహరణకి స్టాండర్డ్ ఆఫ్ లివింగ్. పెద్ద బంగళాలో, ఇంపోర్టెడ్ కార్లలో, ప్రపంచంలోని ఖరీదయిన ముత్యాల నగలతో ఉంటే, ఆ తార పాపులర్ అవుతుంది. ఇమేజ్ చెడదు. ఉదాహరణకి లిజ్. ఇంగ్లీష్ ఏక్ట్రెస్ ఎలిజబెత్ టేలర్. భర్త రిఛర్డ్ కొని ఇస్తాడు ఆమెకి ఖరీదయిన నగలు. ఆ సంగతి పేపర్‌లోకి ఎక్కుతుంది."

"ట్రిక్ ఆఫ్ ది ట్రేడ్" అన్నాను నవ్వి.

"ఇతర దేశాల నుంచి రాజకీయ నాయకులు వచ్చినప్పుడు ఖరీ

దయిన పార్టీలు ఇస్తారు నటులు అందుకే. ప్రజలకి తెలుస్తుంది ఆ సంగతి. ఇవన్నీ ఇమేజ్ కోసం."

"అయిదు భాషల్లో నటిస్తున్నారు కదా? ఎలా ఎడ్జస్ట్ అవగలుగుతున్నారు?"

"తప్పదు మరి" బెంగాలీబాబుకి కూడా ఇబ్బందే మరి" అన్నది నవ్వుతూ.

"బెంగాలీ బాబు?"

"ఓ! వారిని 'బెంగాలీ బాబు' అని పిలుస్తాను. ఈ చిత్రసీమలోని విచిత్రాలలో ఒకటి మనిషి అసలు పేరుని వదిలి మరో పేరు-పెట్ నేమ్-పిలవడం."

ఆ 'వారు' ఎవరో గ్రహించాను వెంటనే. ఓ వర్ధమాన నటుడిని పెళ్ళి చేసుకుంది సునంద అని విన్నాను ఈ మధ్యనే.

"మీ వైవాహిక జీవితం...."

"హాయిగా ఉంది. టైమ్ దొరికితే ఇద్దరం కలిపే భోజనం చేస్తాం. కాల్‌షీట్స్ ఇచ్చే ముందు ఒకరి నొకరు సంప్రదించుకునే ఇస్తాం. ఇద్దరికీ లీషర్ దొరికేలాగా."

"సునంద దగ్గరికి వచ్చారు నలుగురయిదుగురు, ఆటోగ్రాఫ్‌ల కోసం. షూటింగ్ చూడటానికి వచ్చారు వాళ్ళు. భక్తిగా పుస్తకాల్ని అందించి. వింతగా, విచిత్రంగా గుడ్లప్పగించి సునంద వంకే చూస్తూన్న వాళ్ళని చూస్తే నాకు నవ్వు వచ్చింది.

దాన్నే 'వర్‌షిప్' అంటారు. అది ఈ సినిమా రంగంలోనే చెల్లు. ఇంకెక్కడా ఇంత ఉండదు.

"కొంచెం కాలు పక్కకి తీస్తారా ?" అన్నది ఒకామె నా వంక చూసి.

కాళ్ల పక్కకి జరిపాక చేతిలోని చీపురుతో శుభ్రంగా ఊడ్చింది.

సునంద చేతిలోంచి జారి కింద పడి పగిలిపోయిన ఏపిల్ పళ్ళ జ్యూస్ గల గాజు గ్లాస్ ముక్కలని చప్పుడు విని ఒకాయన గబగబా వచ్చాడు.

"ఏమమ్మా ? ఒంట్లో బాగాలేదా ?"

ఖంగారుగా అడిగాడు ఆ ఏభై ఏళ్ళాయన. లుంగీ, పొడుగు చేతుల లాల్చీ జొక్కాలతో తమాషాగా ఉన్నాడు, కొంచెం అసహ్యంగా.

"ఫర్వాలేదు" అన్నది సునంద.

ఆయన వెళ్ళగానే జ్యూస్ తాగి, గ్లాసు ట్రేలో పెట్టి అన్నాను.

"మరికొన్ని ప్రశ్నలే ఉన్నాయి. చెప్పగలరా ఇప్పుడు ?"

"అడగండి. ఆయన దర్శకుడు. ఆ మాత్రం ఇంటరెస్ట్ చూపించకుండా ఉండలేడు. చెయ్యి జారిందంతే పొరపాటున."

"మిమ్మల్ని తెరకి పరిచయం చేసినాయనా ?"

"అవును."

"ఎవరు ఎక్కువ సాయపడ్డారు, మీరు తారగా నిలబడగలిగేందుకు ?"

"నా నటన, ప్రేక్షకుల అభిమానం."

"మీ గ్లామర్ కూడా" అన్నాను నవ్వుతూ.

"థాంక్స్"

ప్రతిగా నవ్వింది సునంద.

సునంద వంక చూస్తూ ఉండిపోయాను కొన్ని క్షణాలు. ముప్ఫై లోపే ఉంటాయి. పాతిక ఉండవచ్చు. గుండ్రటి మొహం తెల్లటి కళ్ళు, కొద్దిగా లావుగా ఉన్నా, అందమైన విగ్రహం. ఆకర్షణీయంగా ఉంది అనుకోకుండా ఉండలేకపోయాను.

"తర్వాతి ప్రశ్న ?" అడిగింది సునంద, నేను తననే గమనిస్తున్నా నన్న సంగతి గ్రహించి.

"ఇంతమందిలో నటించాలంటే మీకు సిగ్గు వేయదా ?" అడిగాను.

వృత్తి అలవాటయిపోయింది. మొదటి రోజు షూటింగ్‌లో భయపడ్డాను. కెమెరాలెన్స్ చూపించి అన్నారు దర్శకుడు. నిర్మాత-ఆ లెన్ కొన్ని కోట్ల మంది ప్రేక్షకుల కళ్లని, ఏమాత్రం తప్పు చేసినా అవి గ్రహిస్తాయని. పాత్రకు న్యాయం చేకూర్చాలి అన్న ధ్యాస తప్ప మిగతా సంగతులు గుర్తుండవు."

కొన్ని క్షణాల తర్వాత అడిగాను : "మీ వ్యక్తిగతమయిన ప్రశ్న అడుగుతాను ఏం అనుకోరుగా ?"

"అడగండి."

ఎవరో టెలిఫోన్ తీసుకువచ్చి, రిసీవర్ అందించారు సునందకి. రెండు నిమిషాలు ఫోన్‌లో మాట్లాడింది. సునందవంకే చూస్తూండి పోయాను.

సునంద నటించిన సినిమాలు నాలుగయిదు చూశాను, టెలిఫోన్‌లో మాట్లాడే సీన్స్, నాటికీ, నేను చూస్తున్న దానికీ చాలా భేదం ఉంది మామూలుగా మాట్లాడింది ఫోన్‌లో, అందరిలాగానే.

అతను టెలిఫోన్ తీసుకుని వెళ్ళిపోయాక అన్నది నాతో !

"గుంటూరులో ఓ సినిమా థియేటర్ ఉంది. దాని విషయం మీద మేనేజర్ ఫోన్ చేశాడు."

"ఇంకా ఎక్కడయినా ఉన్నాయా ?"

"లేవు. కాని, ఎలక్ట్రిక్ దీపాలకి ఉపయోగించే కొన్ని ప్లాస్టిక్ పార్ట్స్ తయారుచేసే పరిశ్రమ ప్రారంభిద్దామని ఆలోచిస్తున్నాను, ఇందాక ఏమిటి అడుగుతున్నారు ?

"వ్యక్తిగతమయిన ప్రశ్న—"

"ఏమిటి ?"

"సమాధానం సూటిగా, నిర్భయంగా ఇవ్వండి."

"ఇంతవరకూ అలాగే ఇచ్చాను."

"మొదటి ప్రశ్నకి తప్పు."

"వృత్తిరీత్యా దానికి సరయిన సమాధానం నా దగ్గర లేదు."

"ఇది పుస్తకంలోకి ఎక్కదు లెండి. ఈ సమాధానం నా కోసం. పాఠకుల కోసం కాదు."

కొన్ని క్షణాలు సందేహించి అడిగాను, బెదురుతూనే!

"చిత్రసీమలోని అవినీతి మీమీదకూడ ప్రసరించింది కదా?"

"అంటే? ప్రశ్న అర్థం కాలేదు."

"అంటే.... వెల్. శీలం బలి ఇస్తే గాని సినిమా తార కాలేరని అందరికీ తెలిసిన సత్యం. మీ విషయంలో కూడా అలాగే జరిగిందా?"

కోపంతో ఉగ్రంగా లేస్తుందనుకున్నాను. నవ్వుతూ అలాగే కూర్చుంది, నన్ను చూస్తూ.

"ఇతర రంగాల్లో లేదంటారా అశ్లీలత?" అడిగింది కాస్సేపాగి.

"నా ప్రశ్నకి సమాధానం కాదు ఇది. నిర్భయంగా, సూటిగా కావాలి సమాధానం."

"అవును. అందరికీ తెలిసిన సత్యం. నా విషయంలో కూడా అలాగే జరిగింది. మీ పుస్తకంలో వ్రాస్తే మటుకు పరువు నష్టం దావా వేస్తాను" అన్నది నవ్వుతూ.

"థాంక్స్ ఫర్ బియింగ్ కైన్డ్ ఇన్డీడ్."

"ఆఫ్టరాల్ మీకు తెలియని సత్యం మరొకటుంది."

"ఏమిటి?"

"వ్యక్తిగతంగా చెపుతున్నాను. పుస్తకంలో రాయకూడదు."

"అలాగే."

"మగాళ్ళే కాదు, కొంతమంది ఆడవాళ్ళు కూడా మంచి వాళ్ళు కాదు ఇక్కడ. వాళ్ళతో సరిగా ఉండకపోతే పైకి రాలేము."

"అంటే!"

"అంటే 'లెస్బియన్' అనే ఇంగ్లీషు మాటకి అర్థం వెతుక్కోండి. దానికి కూడా గురయ్యాను నేను."

"నాకు అర్థం తెలుసు" అన్నాను, సునంద కళ్ళలోకి చూస్తూ ఆశ్చర్యంగా.

"తర్వాతి ప్రశ్న?" మామూలుగా అడిగింది.

"ఇంక ప్రశ్నలేవు."

చేతి గడియారం వంక ఓసారి, తర్వాతి షాట్ కోసం తయారవుతున్న సిబ్బంది వంక ఓసారి చూసి అడిగింది. సునంద నన్ను షార్ట్ హాండ్ పుస్తకం వంక చూపిస్తూ.

"ఎప్పుడు ప్రచురిస్తారు ఇది?"

"వచ్చే వారం. మీ ఫోటో కూడా కావాలి లేకపెట్టది."

"రేపు పోస్ట్‌లో పంపుతాను పంచిది. మీది ఫోటో ప్రాసెస్ పద్ధతా?"

"అవును. ఆ పద్ధతితోనే ప్రింట్ చేస్తాము పత్రికని."

సునంద తర్వాత షాట్‌కి సంబంధించిన స్క్రిప్ట్ చదువుకోసాగింది.

అరగంట తర్వాత మళ్ళీ ధన్యవాదాలు చెప్పి, స్టూడియోలోంచి బయటపడ్డాను నేను, తర్వాత షాట్ కూడా చూసి.

ఆఫీస్‌లో రెండు గంటల పైనే పట్టింది ప్రశ్నలు, సమాధానాలు వ్రాసి, ఫోటోతో సహా ప్రెస్‌కి మెటీరియల్ సిద్ధం చేయడానికి.

కనీసం మరొక పదేళ్ళయినా హీరోయిన్‌గా నిలబడగల్గే స్తోమత టాలెంట్ ఉన్న సునంద ఇంటర్వ్యూ గల పత్రిక సేల్స్ అనుకున్న దానికన్నా ఎక్కువే అయాయి.

*　　*　　*

"మీరు నటి కాకపోయినట్లయితే మరేం అయ్యేవారు?"

"స్కూల్ టీచర్ ని."

అలోచించకుండా వెంటనే సమాధానం చెప్పింది.

"థాంక్స్. ఆఖరి ప్రశ్న కూడా అడిగేశాను. పదిహేను రోజుల్లో సంచిక వెలువడుతుంది. మీకు స్వయంగా అందజేస్తాము."

నా ఎదురుగా పల్లెటూరి అమ్మాయి దుస్తుల్లో కూర్చుని ఉన్న సమత తియ్యగా నవ్వి అన్నది.

"థాంక్స్."

"మీరు ఇంతవరకు నటించిన చిత్రంలోని భాగాలు చూపిస్తామన్నారు నిర్మాత. అది చూసి వెళ్తాను."

లేచాను నేను, షార్ట్‌హాండ్ పుస్తకంతో.

"కూర్చోండి" అన్నది సమత.

"మీరు నన్ను ఇంటర్వ్యూ చేస్తారా!" నవ్వుతూ అడిగాడు కూర్చుని.

కొన్ని క్షణాలు నా కళ్ళలోకి చూసింది సమత.

"నన్ను గుర్తు పట్టలేదా ?" అడిగింది.

"మిమ్మల్ని గుర్తు పట్టడమా ?"

సమత మొహంలోకి ఆశ్చర్యంగా చూస్తూ అడిగాను.

"గుర్తు పట్టలేదు. అసలు నాకు తెలియదు మీరెవరో గుర్తు పట్టేందుకు."

"సమత సినిమాలోకం కోసం సృష్టించిన పేరు. నా అసలు పేరు మరొకటి ఉంది."

రెండు నిమిషాలు సమతని పరిశీలనగా చూస్తూండిపోయాను. గుర్తు రాలేదు ఎక్కడ చూసింది.

తల అడ్డంగా ఊపుతూ అన్నాను.

"మిమ్మల్ని ఇదివరకు ఎక్కడా, ఎప్పుడూ చూసిన గుర్తు రాలేదు చూస్తే అంత త్వరగా మర్చిపోయేవాణ్ణి కాను."

చిన్నగా నవ్వింది సమత. సమత చేతిలోని గాజు గ్లాసు జారి కింద పడింది చప్పుడు చేస్తూ. గ్లాసు పగిలి చాలా ముక్కలయిపోయింది. గ్లాసులోని ఖరీదయిన ఏపిల్ జ్యూస్ అంతా నేల మీదికి ఒలికిపోయింది.

"ఒంట్లో బాగాలేదా, తల్లీ ?"

సమత తల్లి కంగారుగా అడిగింది, కూతురు చెయ్యి దగ్గరికి తీసుకుని టెంపరేచర్ చూస్తూ

చిన్నగా నవ్వి అన్నది సమత నాతో, తల్లికి సమాధానం ఇవ్వకుండానే:

"గుర్తుకు రావడం లేదా ?"

"లేదు" అన్నాను, తల విదిలించి.

"సరిగ్గా మూడు సంవత్సరాల క్రితం, ఇక్కడే, ఈ ఫ్లోర్‌లోనే ఇదే చోట, ఇలాగే...."

ఈ మూడు సంవత్సరాల్లో చాలా జరిగాయి. నేను పనిచేస్తున్న మాగజైన్ అమ్మకానికి వస్తే నేనే కొనేశాను చవకలో. మాగజైన్‌లో అనేక మార్పులు తీసుకువచ్చాను. ఫలితంగా సేల్స్ పెరిగాయి.

సేల్స్‌తోపాటు నా పని పెరిగింది. అనేక ఇంటర్వ్యూలు, ప్రివ్యూలు, సభలు, సమావేశాలు, పుట్టిన రోజు పండగలు. పెళ్ళిళ్ళు-చాలా వాటికి హాజరయ్యాను. అనేకమందితో పరిచయం అయింది, కొత్త వాళ్ళతో.

మూడు సంవత్సరాలలో జరిగిన ఈ విషయాలన్నీ తప్పించుకుని వెనక్కి వెళ్ళడం కష్టం. గుర్తు రాలేదు.

"ఇక్కడే చూశారు. నేను గుర్తుచేస్తాను మీకు గుర్తుకు రాకపోతే." నవ్వి, నా అవస్థ గమనించి అన్నది సమత.

"మీరు సునందని ఇంటర్వ్యూ చేయడానికి వచ్చారు. అప్పుడు చూశారు నన్ను. ఇక్కడ కాదు, అక్కడ."

చెయ్యి పెట్టి చూపించిన వైపు చూశాను. సమత చేతిలోంచి క్రింద పడి పగిలిపోయిన గాజు గ్లాసుని శ్రద్ధగా ఊడుస్తూంది ఒకామె, ముక్కలు ఏరి.

స్వీపర్ ! స్టూడియో ఫ్లోర్ స్వీపర్ !!

అదిరిపడి చూశాను సమత కళ్ళలోకి.

"అవును. ఆ రోజు ఇదే సంఘటన జరిగింది. సునంద చేతిలోని గ్లాసు పగిలితే, నేను శుభ్రం చేశాను, ఆనాడు నా డ్యూటీ కాబట్టి."

"అమ్మాయ్ ! ఏమిటా మాటలు ?"

సమత తల్లి వారించింది కొంచెం కోపంగా. తల్లి మాటలు పట్టించుకోకుండా చెప్పుకుపోసాగింది సమత :

"ఆ రోజు మీరు వెళ్ళిపోయాక ఓ షాట్‌లో ఎక్స్ట్రా అవసరం వచ్చింది. అనుకున్నవాళ్లు రాకపోవడం వల్ల మిగతా చోట్ల ప్రయత్నం చేశారు కాని, ఎక్కడా వాళ్ళకు కావలసిన ఎక్స్ట్రా నటి దొరకలేదు. నన్ను చూశాడు దర్శకుడు. 'నటిస్తావా' అని అడిగాడు. సంబరపడ్డాను. అంతదాకా అందరూ నటిస్తూంటే చూడటమే గాని, ఎప్పుడూ వాళ్ళలాగా ఆడలేదు.

అయిదు నిమిషాల్లో ముఖానికి రంగు పులుముకుని, అందరూ నవ్వుతూంటే, అలాగే కెమెరా ముందు నిలబడ్డాను. సినిమాలో నా పోర్షన్ కేవలం పావు నిమిషం మాత్రమే కాని, అదృష్టం. ఆ పదిహేను క్షణాలూ నా ముఖం తెరపై క్లోజప్‌లో కనిపిస్తుంది.

'మహారాజా ! మహారాజా ! తమకి పుత్రుడు కలిగాడు' అని చెప్పటమే నా పోర్షన్ అంతా.

ఆ పావు నిమిషం నా జీవితాన్ని మార్చేసింది. నా అదృష్టం ఆ పావు నిమిషంగా మారిందా అనిపిస్తుంది ఇప్పుడు తలుచుకుంటే. ఆ

సినిమా చూసిన ఓ నిర్మాత ముఖాన్ని చూసి తన పిక్చర్‌లో బుక్ చేసుకున్నాడు వారం రోజుల్లో.

ఆ సినిమాలో నాది పెద్ద పాత్ర. నా నటన మెచ్చుకున్నారు. బాగా డబ్బు చేసుకుంది. తర్వాత మరొక సినిమాలో బుక్ అయాను. ఆ తర్వాత ఇంకొకటి మరొకటి. ఈ మూడు సంవత్సరాల్లో ముప్పై పైనే నటించి 'వర్ధమాన నటి' అనిపించుకున్నాను." ఆగి, సమత నా వంక చూసింది.

ఎన్నో సినిమాలు చూశాను, సమత ఉన్నవి. సమతని చాలాసార్లు చూశాను ముఖాముఖి. కాని, సమత కళ్ళలోని ఆ భావం, ఆ బాధ, ఆ తెలియని ఆరాటం ఎప్పుడూ చూడలేదు ఇంతదాకా.

ఊపిరి పీల్చుకుంటూంది సమత.

"అదేం రాయబోకండి మీ పత్రికలో."

హెచ్చరించింది సమత తల్లి కంగారు కప్పిపుచ్చుకుంటూ నాతో, 'జాగ్రత్త' అనే భావం వచ్చేలా.

"దేనికి ఇదంతా చెప్పారు మీరు?" అడిగాను నేను కొన్ని క్షణాలాగి.

"ఎందుకంటే 'తార'గా మీరు పరిచయం చేస్తున్నారు మీ 'తార' పత్రికలో కాని, తారగా పరిచయం చేయవద్దు. ఓ నటిగా పరిచయం చెయ్యండి చాలు."

నవ్వు వచ్చింది నాకు.

"తారకీ, నటికీ తేడా ఏమిటి?" అడిగాను.

"చాలా ఉంది తేడా" అని కాస్సేపాగి చెప్పింది సమత :

"నక్షత్రం—అంటే తార—ఎక్కువ రోజులు ఉండదు. ఉన్నంత కాలం వెలిగిపోతుంది ధగ ధగా. తర్వాత రాలిపోతుంది. రాలిపోయిన

తర్వాత దాని విషయం మర్చిపోతారు. ఎందుకంటే, మరొక కొత్తతార ఆక్రమిస్తుంది ఆ చోటుని. అప్పుడు ఆ కొత్త నక్షత్రాన్ని చూస్తారుఅంతా.

తెర తార స్వశక్తితో వచ్చింది కాదు పైకి. అదృష్టం వల్ల రాబడు తుంది. కొంతకాలమే తెరమీద నిలుస్తుంది. తర్వాత నక్షత్రంలా నిష్క్రమిస్తుంది మరొక కొత్త తార ఆ ఖాళీ చోటుని భర్తీ చేస్తుంది."

ఆశక్తిగా వినసాగాను, సమత చెప్పే మాటల్లో అర్థం ఉందని గ్రహించి.

"ఐయామ్ ఫండమెంటల్లీ ఏక్ట్రెస్. నాట్ ఎ స్టార్.తారని ఎప్పుడూ కాదు. నటినే."

అర్థమయిందా అన్నట్లుగా చూసింది నా కళ్ళలోకి.

"అఫ్‌కోర్స్ మీరు తార అనుకున్నా నటి అనుకున్నా చివరికి ఏం జరగాలో అదే జరుగుతుంది. మీరు అపలేరు నేను అపలేను."

"కావచ్చు. కాని నాకు నేనుమాత్రమే 'నటి' అనుకుంటేనే తృప్తిగా ఉంటుంది. నా ముందు నాలాంటి వాళ్ళు పదిమంది పైగానే ఉన్నారు తారలా వెలిగి. కాదు ఆరిపోయారు, పాపం. ఇప్పుడు నా సంగతి ఎవరూ తలుచుకోరు. నేను ఆరిపోవచ్చు ఓ రోజు."

సమత మాటల్లో తను నెట్టివేయబడవచ్చనే బాధ, ఎవరయినా తను సంపాదించుకున్న స్థానాన్ని ఆక్రమించవచ్చనే ఆరాటం, అలాంటి దుర్దినం రావచ్చనే, ఆక్రోశం స్పష్టమయాయి నాకు.

"ఆల్‌రైట్ మీరు చెప్పినట్లుగా 'నటి'గానే పరిచయం చేస్తాను" అన్నారు 'నటి' అన్న మాట ఒత్తి పలుకుతూ.

సమత మౌనంగా ఉండిపోయింది.

"సునందని అంత త్వరగా ప్రేక్షకులు, నిర్మాతలు మరిచిపోతారనుకోలేదు ఎప్పుడూ. వెర్సటైల్ అండ్ టాలెంటెడ్ షి ఈజ్" అన్నాను, చిన్నగా నిట్టూర్చి.

"అంతేకాదు, సంపాదించే రోజులలో దాచుకోవాలనే తెలివి లేనిదీ కూడా అన్నది సమత తల్లి ఈసడింపుగా.

"మీరు చెప్పింది నాటకరంగం ఎక్కువగా జరిగింది ఆంధ్రదేశంలో. ఎంతోమంది నటశేఖరులు సినిమాలోకి వచ్చాక, నాటకాల్ని ఆదరించేవాళ్ళు మరీ ముసలివాళ్ళయిపోయి, ఓపికపోయి ఒంటరివాళ్లగానే కాలక్షేపం చేస్తున్నారు. మృత్యువు త్వరగా వస్తే బాగుండు అనుకుంటూ నాకు తెలిసిన ఒకనాటి మేటి నటుడు ఇప్పుడు ఓ సత్రంలో ఉంటున్నాడు, నా అనే దిక్కు లేక అన్నాను కొంచెం ఉద్వేగంగా.

త్వరలోనే ఇప్పుడెక్కడున్నారు?" అన్న శీర్షికకింద పాతతారలని పాఠకులకి గుర్తు చేశాను. 'తార' ద్వారా చాలామందిని.

సునంద ఎక్కడ ఉందో ఊహించగలరా? బహుశా సమత ఆ రోజు అంత బాధపడటానికి కారణం, దినదినము కనిపిస్తూ తార గతి ఏమవచ్చో గుర్తు చేసే సునందే అనుకుంటాను.

సునంద వంటమనిషి, సమత ఇంట్లో!!

(ఆంధ్రప్రభ 1973)